క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 7న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. విద్యుత్ నగర్, సహకార నగర్, పోస్టల్ కాలనీ, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అడ్వకేట్స్ కాలనీలోని రోడ్డు నంబర్ 8, 9 ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశోజీ సెంటర్: డీఎడ్, డీపీఎస్ఈ కోర్సుల్లో ప్రవేశాలకు జూలై 7న నిర్వహించే డీఈఈ సెట్–2024కు శనివారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వరంగల్ డీఈఓ వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 50శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్సీ విద్యార్థులు 45 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు http://deecet.cdse.telangana.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాలనీ బోర్డుల ఏర్పాటు

హన్మకొండ అర్బన్: బాలసముద్రం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కాలనీలోని పలు రోడ్లలో కాలనీ బోర్డులను ఏర్పాటు చేసినట్లు కాలనీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నామిరెడ్డి సీతారాంరెడ్డి, గుర్రాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కమిటీ సొంత ఖర్చుతో ఈ బోర్డులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాలనీలో రోజురోజుకు పెరుగుతున్న కమర్షియల్ కాంప్లెక్స్‌లు, ఆస్పత్రుల నిర్మాణం వల్ల కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు. కాలనీలో డ్రెయినేజీ, పార్కులను అభివృద్ధి చేయాలని కోరారు.

అన్నదానం

హన్మకొండ అర్బన్: అమావాస్య సందర్భంగా శ్రీభద్రకాళి వీరభద్ర సేవా సమితి ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ ఎదుట గురువారం అన్నదానం చేసినట్లు సమితి సభ్యులు తెలిపారు. గత ఐదు నెలలుగా సమితి ఆధ్వర్యంలో ప్రతినెలా అమావాస్య రోజున సుమారు 200 మందికి పైగా అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు శ్రీధర్, ధనుంజయ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కాశిబుగ్గ: లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో కాశిబుగ్గలో బాటసారులకు గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం సభ్యుడు గాజుల రాజేష్ తన తండ్రి గాజుల శ్రీహరి జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్ తెలిపారు. సభ్యులు వేముల నాగరాజు, దుస్సా కృష్ణ, సింగం కృష్ణ, కోట నరేష్, వంగ ఐలయ్య, శ్రీరాములు, శ్రవణ్ పాల్గొన్నారు.

ఎడ్లబండ్ల జాతర ప్రారంభం

మడికొండ: వీరభద్రస్వామి కార్పొరేషన్ ఆధ్వర్యంలో చిల్పూరు గుట్ట ఎడ్లబండ్ల జాతరను రాష్ట్ర ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్ ఫర్టిలైజర్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ దర్గా సొసైటీ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు దువ్వ విజయ్, కుర్ల మోహన్, కొప్పుల నవీన్‌యాదవ్, బైరి కొంరయ్య, దేవరాజ్, చంటి, వినయ్, కొలంబో, గౌతం, యాదగిరి పాల్గొన్నారు.

లారీ ఓనర్ల మధ్య వర్గపోరు

ఖిలా వరంగల్: ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో లారీ ఓనర్లు, కార్యవర్గ సభ్యుల మధ్య జరుగుతున్న వర్గపోరు తీవ్రస్థాయికి చేరింది. కమిటీ ఎన్నికై రెండేళ్లు పూర్తి చేసుకున్నా.. నూతన కమిటీ ఎన్నికపై దృష్టి సారించడం లేదని, సీరియల్ విధానంపై ప్రశ్నిస్తే కార్యవర్గం దాడులకు తెగబడుతోందని ఓనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న విషయాల్లో లారీ ఓనర్లు పరస్పరం దాడులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల లారీ సీరియల్ విధానంలో లారీ ఓనర్లు, కార్యవర్గం మధ్య గొడవలు జరగగా ఒకరు గాయపడ్డారు. ఈ ఘటన మరువక ముందే తాజాగా వరంగల్ – నర్సంపేట రోడ్డులోని ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ పార్కింగ్ స్థలంలో సీరియల్ విధానంపై ప్రశ్నించిన ఓ లారీ ఓనర్‌పై కార్యవర్గ సభ్యులు, అనుచరులు గురువారం దాడికి పాల్పడినట్లు తెలిసింది. క్షతగాత్రుడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

రాష్ట్ర చిహ్నం నమూనా

వరంగల్: ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రస్తుత రాష్ట్ర చిహ్నం మార్పును ఆహ్వానిస్తూ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర చిహ్నం రూపొందించినట్లు వరంగల్ ఉపాధ్యక్షుడు దామెర శ్రవణ్ తెలిపారు. ఈమేరకు చిహ్నం నమూనాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని వరంగల్ తహసీల్దార్ ఎండీ.ఇక్బాల్‌కు గురువారం అందించినట్లు వివరించారు. ప్రసంగిపాల్, దినేష్, ఠాగూర్ పాల్గొన్నారు.

ఆలయంలో దర్శనమిచ్చిన శునకం

కాశిబుగ్గ: కాశీ విశ్వేశ్వరాలయ దేవాలయంలో ఓ శునకం దర్శనమిచ్చి పూజలు చేసింది. గురువారం అర్చకులు, భక్తులు పూజలు చేస్తుండగా ఎక్కడి నుండో ఓ శునకం వచ్చి కాలభైరవుడి ఎదుట సాష్టాంగ నమస్కారం చేసింది. ఈ సంఘటన వాట్సప్ గ్రూపుల్లో వైరల్ అయింది.

చట్టాలపై అవగాహన తప్పనిసరి


రామన్నపేట: పోలీసులు, సిబ్బందితో డీసీపీ బారి


మామునూరు: మాట్లాడుతున్న డీసీపీ రవీందర్

రామన్నపేట: జూలై 1వ తేదీ నుంచి అమలుకానున్న నూతన చట్టాలపై పోలీసులందరు తప్పకుండా అవగాహన ఉండాలని సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి సూచించారు. వరంగల్, హనుమకొండ డివిజన్ల పోలీస్ అధికారులు, సిబ్బందికి నూతన చట్టాలపై అవగాహన కల్పించడంలో విడతల వారీగా ఏర్పాటు చేస్తున్న శిక్షణ తరగతుల్లో భాగంగా నగరంలోని ఎల్‌బీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు హాజరై ఆయన మాట్లాడారు. జూలై1 నుంచి దేశవ్యాప్తంగా కొత్త చట్టాల అమలుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందుకనుగుణంగా కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందని తెలిపారు. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం –2023 చట్టాలపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చని అన్నారు. అందులో భాగంగా కమిషనరేట్‌లోని పోలీసులందరికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు డీసీపీ బారి వివరించారు. ఏసీపీలు నందిరాం నాయక్, దేవేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు గోపి, శివకుమార్, మల్లయ్య, సంజీవ్, సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మామునూరు: నూతన చట్టాలపై పోలీసులు అవగాహన పెంచుకోవాలని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ సూచించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా ఆదేశాల మేరకు విడతల వారీగా ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో భాగంగా ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో మామునూరు సబ్ డివిజన్ ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో నూతన పోలీస్ చట్టాలపై మామునూరు, పరకాల, నర్సంపేట డివిజన్ల పోలీస్ అధికారులు, సిబ్బందికి గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ హాజరై శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. జూలై 1నుంచి దేశ వ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. కొత్త చట్టాల గురించి ప్రతీఒక్క అధికారి, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జిల్లాలో పోలీసులందరికి విడతల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. కొత్త చట్టాలపై అవగాహన రావాలంటే నేర్చుకోవాలనే తపనలో ఉన్నప్పుడే సాధ్యమవుతుందని డీసీపీ తెలిపారు. ఏసీపీ కిషోర్, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, శ్రీనివాస్, రంజిత్ రావు, పవన్, రమేష్, క్రాంతికుమార్, రాజగోపాల్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలి


అవగాహన కల్పిస్తున్న పూర్ణచంద్రారెడ్డి

మామునూరు: వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, వరంగల్ ట్రాఫిక్ ఆర్ఎస్సై (ఇన్‌స్టక్టర్) పూర్ణచంద్రారెడ్డి సూచించారు. ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో భాగంగా ఖిలా వరంగల్ మండలం మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో 8వ బాలిక బెటాలియన్ వరంగల్ డిప్యూటీ కమాండెంట్ రేవతి ప్రభాకరన్ ఆధ్వర్యంలో ఈనెల 1నుంచి జరుగుతున్న ఎన్‌సీసీ శిబిరం గురువారం ఆరవ రోజుకు చేరింది. ముఖ్యఅతిథిగా వారు హాజరై మాట్లాడారు. మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. కారు నడిపేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. అనంతరం ఎన్‌సీసీ కేడెట్లకు ట్రాఫిక్ రూల్స్‌పై ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమాండెంట్ రవీంద్రకుమార్ రవి, రమణరావు, కె.స్వప్న, సుజితాదేవి, గాయత్రి రమావత్ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

రామన్నపేట: రియా ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్న పల్లె మొగిలి(60) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మొగిలి కుమారుడు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపి తెలిపారు.

రైలునుంచి జారిపడి రైల్వే ఇంజనీర్..

కాశిబుగ్గ: ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలునుంచి జారిపడి రైల్వే జూనియర్ ఇంజనీర్ దుర్మరణం చెందిన ఘటన ఇంటికన్నె – నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య గురువారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన దండుబోయిన తరుణ్ కృష్ణ (30) ట్రాక్ మిషన్ జూనియర్ ఇంజనీర్‌గా కాజీపేటలో పని చేస్తున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని రైలులో ప్రయాణిస్తూ జారిపడి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు సీఐ వివరించారు.

పిడుగుపాటుకు ఎద్దుల మృతి



హసన్‌పర్తి: పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి చెందిన సంఘటన హసన్‌పర్తి మండలం గంటూరుపల్లిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ గ్రామానికి చెందిన పింగిలి సమ్మిరెడ్డి.. తన రెండు ఎద్దులను చెట్టు కింద కట్టేశాడు. పిడుగుపాటుకు ఆ ఎద్దులు మృత్యువాత పడడంతో ఆ రైతు బోరున విలపించాడు. వాటి విలువ సుమారు రూ. 1.10 లక్షలు ఉంటుందని స్థానికులు చెప్పారు. సమాచారం అందుకున్న వైద్యాధికారి క్రాంతికుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కాగా, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కిషన్‌రెడ్డి కోరారు.

సెక్యులరిజాన్ని కాపాడుకుందాం..


ప్రార్థన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులు

కాజీపేట రూరల్: సెక్యులరిజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి ఉందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కాజీపేట దర్గాను ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి ఆమె గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి దర్గా పీఠాధిపతి, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా స్వాగతం పలికి దర్గా వద్దకు తోడ్కొని వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం కడియం కావ్య విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో కులమతాలకు అతీతంగా అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ అన్ని మతాల వారు ఐక్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు విజయశ్రీ రజాలీ, పుర్కాన్, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, నాయకులు సింగారపు రవి, యూనిస్, అజీజ్, అబ్దుల్ పాల్గొన్నారు.

భద్రకాళి దేవాలయంలో ఎంపీ కావ్య పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని వరంగల్ ఎంపీ కడియం కావ్య గురువారం సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, ఆమెకు ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి మహాదాశీర్వచనం చేశారు.

ఎంపీ ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టారు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

న్యూశాయంపేట: ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడిన బీజేపీకి ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్రి ప్రసాద్ విమర్శించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి అధ్యక్షతన హనుమకొండ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం విస్తృత స్థాయి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని, గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. ఈనెల 10న హైదరాబాద్‌లో జరగనున్న ఉపాధి కూలీల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు జి.రాజుల రాములు, రాఘవులు, భిక్షపతి, స్వరూప, సురేందర్, శ్రీధర్, రజిత, అనిషా, జయక్క, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. క్రిస్టియన్ కాలనీకి చెందిన పోలెపాక సుమిత ప్రభాకర్ దంపతుల కుమార్తె సింధు(19) ఇంటర్ పూర్తి చేసి ఇంటివద్దే ఉంటోంది. బుధవారం రాత్రి కూరగాయలు తెస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దాంతో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లి పోలెపాక సమిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మహిళ హత్య కేసుపై విచారణ

మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని అమ్మవారిపేట శివారులో బుధవారం హత్యకు మహిళ కేసుపై పోలీసులు విచారణ చేస్తున్నారు. దర్గా కాజీపేట లవుడ్య తండకు చెందిన లావుడ్య యామిని (33)ని తలపై బండరాయితో మోదీ హత్య చేయగా ముగ్గురు నిందితులను మడికొండ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

వైన్‌షాపు వెయిటర్‌పై కేసు

ఖిలా వరంగల్: మద్యం తాగడానికి మద్యం షాపుకు వచ్చిన ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన వెయిటర్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. వరంగల్ పోర్ట్‌రోడ్డులోని వైష్ణవి వైన్స్‌కు బుధవారం మధ్యాహ్నం మందు తాగడానికి కరీమాబాద్‌కు చెందిన మరుపల్లి శ్రీధర్, రాజ్‌కుమార్ వచ్చారు. వారిద్దరు మద్యం తాగుతున్న క్రమంలో మద్యం, ఫుడ్ సరఫరా చేసే వెయిటర్ సమీనొద్దీన్ డబ్బులు డిమాండ్ చేస్తాడు. ఈక్రమంలో డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించడంతో రాజ్‌కుమార్‌పై సమీనొద్దీన్ దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం సమీనొద్దీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రైతుల సమస్యలపై ఉద్యమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న చుక్కయ్య

న్యూశాయంపేట: రైతుల క్షేత్రస్థాయి సమస్యలపై ఉద్యమించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య పిలుపునిచ్చారు. హనుమకొండలోని సుందరయ్య భవన్‌లో మొమిడి శ్రీకాంత్, బండి పర్వతాలు అధ్యక్షతన సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. రైతాంగ సమస్యలపై జిల్లాలోని ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. జూలై చివరి నాటికి మండల సదస్సులు నిర్వహించాలని, అన్ని మండలాల్లో క్షేత్రస్థాయి సమస్యలపై చర్చించాలని సూచించారు. సమావేశంలో శ్రీనివాస్, శంకర్‌రావు, మోహన్‌రావు, నారాయణరెడ్డి, నాగరాజు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఒకపూట పని విధానాన్ని కల్పించాలి


రెండు పూటల పని విధానంపై నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

హన్మకొండ: ఉష్ణోగ్రతలు ఇంకా తగ్గనందున మున్సిపల్ కార్మికులకు రెండు పూటల పనిని నిలిపివేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. హనుమకొండలో 57, 58వ డివిజన్లలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులతో కలిసి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత తగ్గకున్నా మున్సిపల్ కార్మికులతో రెండు పూటలు ఎలా పని చేయిస్తారని ప్రశ్నించారు. ఈక్రమంలో మున్సిపల్ అధికారుల తీరును ఆయన ఖండించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రెండు పూటల పని విధానాన్ని తీసివేసి ఒక్కపూటనే 8 గంటలు పని చేయిస్తుంటే వరంగల్ మహానగర మున్సిపల్ కార్పొరేషన్‌లో రెండు పూటలు పని చేయిస్తుండడంతో కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ఒకపూట పని విధానాన్ని అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్ పాల్గొన్నారు.

నిలకడగా భూగర్భ జలాలు

హన్మకొండ: గత నెలతో పోలిస్తే హనుమకొండ జిల్లాలో భూగర్భ జలాలు నిలకడగా ఉన్నాయి. వరి సహా, ఇతర యాసంగి పంటలు కోతకు రావడం, వానాకాలం సాగు పనులు ప్రారంభం కాకపోవడంతో భూగర్భ జలాల వినియోగం తగ్గింది. ఏప్రిల్ మాసాంతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగాయి. ఏప్రిల్ మాసాంతంలో జిల్లాలో సగటున 9.90 మీటర్ల లోతులో ఉండగా.. మే మాసాంతానికి 8.72 మీటర్లకు చేరుకున్నాయి. 2023 మే మాసాంతంలో 6.11 మీటర్ల లోతులో ఉండగా.. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పాటు చెరువులు, కుంటల్లో నీరు లేకుండా పోవడంతో భూగర్భ జలాలు పడిపోయాయి. దీంతో గతేడాది మే మాసాంతంతో చూసుకుంటే ఈ ఏడాది మే మాసాంతానికి 2.62 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. గత నెలతో పోలిస్తే 1.17 మీటర్లు భూగర్భ జలమట్టం పెరిగింది. ఇప్పుడు వర్షాలు కురిసిన వెంటనే భూగర్భ జలాలు వెంటనే పెరిగే అవకాశం ఉండదు.

ప్రభుత్వ బడి.. అమ్మ ఒడి లాంటిది


బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఎం, ఉపాధ్యాయులు, తదితరులు

మడికొండ: ప్రభుత్వ బడి.. అమ్మ ఒడి లాంటిదని, ఎలాంటి ఒత్తిడిలేని స్వేచ్ఛ పూరిత వాతావరణంలో ఆటపాటలతో కూడిన బోధన ఉంటుందని మడికొండ ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ మల్లారెడ్డి వివరించారు. బడిబాట కార్యక్రమాన్ని పాఠశాలలో గురువారం ర్యాలీని ప్రారంభించి ఆయన మాట్లాడారు. బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. విశాలమైన తరగతి గదులు, క్రీడా స్థలం, ఉచిత యూనిఫాం, వారానికి మూడు రోజులపాటు కోడిగుడ్లతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలే ముద్దు అని సూచించారు. ఉన్నత విద్యనభ్యసించిన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యబోధన ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ఎం.అరుణ, ఉపాధ్యాయులు కోమల్‌రెడ్డి, రమేష్, వేణుగోపాల్, అరుణ, కమల, సరిత, అంగన్‌వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, రజిత, మల్లీశ్వరి, రాజమణి, లలిత, మంజుల, కవిత, తదితరులు పాల్గొన్నారు.

‘విద్యారంగం వ్యాపారమయం’


సమావేశంలో మాట్లాడుతున్న మొగిలివెంకటరెడ్డి

కేయూ క్యాంపస్: విద్యను వ్యాపారమయం చేస్తూ అధిక ఫీజుల వసూలుకు తెగబడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలివెంకటరెడ్డి డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్య కేంద్రం సెమినార్ హాల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే నుంచే విద్య వాపారానికి ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యజమాన్యాలు తెరలేపాయని విమర్శించారు. ఇంటర్నేషనల్, పబ్లిక్, సీబీఎస్సీ పేర్లతో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ, పుస్తకాలు, స్కూల్ యూనిఫాం పేరుతో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో రెగ్యులరేటరీ కమిటీని ఏర్పాటుచేసి ఫీజులను నియంత్రించాలని ప్రభుత్వానికి సూచించారు. విద్యా హక్కుచట్టం కింద ప్రతీ పాఠశాలలో 25శాతం సీట్లు పేదల కోసం కేటాయించాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు రంజిత్‌కుమార్, కేయూ ప్రధాన కార్యదర్శి మహేష్, బాధ్యులు వంశీకుమార్, గణేష్, సాయిచంద్, దేవేందర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

సమసమాజం కోసం ఉద్యమించిన నేత


రాజేశ్వర్‌రావుకు నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: దున్నే వాడికే భూమి కావాలని, భూసామ్య దోపిడీకి వ్యతిరేకంగా అంతరాలు లేని సమసమాజ నిర్మాణం కోసం ఉద్యమించిన గొప్ప నేత చంద్ర రాజేశ్వర్‌రావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి కొనియాడారు. పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వర్‌రావు జయంతి ఉత్సవాలను హనుమకొండలోని బాలసముద్రం సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, శ్రీనివాస్, ఎల్లేష్, ఎం.భిక్షపతి, కర్రె లక్ష్మణ్, రాజు, వెంకటరమణ, సంతోష్, శ్రీనివాస్, సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు విత్తాం.. నీళ్లు లేవు..


మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్

హసన్‌పర్తి: చెరువులు ఎండిపోయాయి.. కాల్వల్లో నీరు లేదు.. బావుల కింద విత్తనాలు విత్తాం.. కరెంట్ మాత్రం ఇవ్వడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే నాగారం గ్రామంలోని ఎస్ఎస్ 45 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో సుమారు 25 మోటారు కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రైతులు వారం రోజుల క్రితం విత్తనాలు విత్తారు. అనంతరం నీరు రాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయిందని గ్రహించారు. దాంతో వారం రోజులుగా నీరు లేక విత్తనాలు మాడిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయాలని విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఎంపీ కడియం కావ్యకు అభినందనలు


అభినందనలు తెలుపుతున్న రెడ్డి సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: వరంగల్ ఎంపీగా విజయం సాధించిన డాక్టర్ కడియం కావ్యను పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలోని స్వగృహంలో ఎంపీతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రియదర్శి, మండల సమ్మయ్య, జనగాం శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో..

హన్మకొండ అర్బన్: వరంగల్ ఎంపీ కడియం కావ్యను నగరంలోని కనకదుర్గ కాలనీలోని ఆమె స్వగృహంలో తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అలాగే, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, రాష్ట్ర కో ఆర్డినేటర్ రావుల నర్సింహారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కామిడి సతీష్‌రెడ్డి, నాయకుల నల్ల రాజిరెడ్డి, చాడ జైహింద్‌రెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, చాడ కొమురారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

55వ డివిజన్ నాయకులు

హసన్‌పర్తి: ఎంపీ కడియం కావ్యను 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్లు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సంగాల ప్రేమ్‌కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు మార్క్ రాజు, దేవస్థాన మాజీ ధర్మకర్త సంగాల చిన్న, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం నాయకులు..

హసన్‌పర్తి: ఎంపీ కడియం కావ్యను రెడ్డి సంఘం సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మ రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, జయపాల్ రెడ్డి, పింగిలి అశోక్‌రెడ్డి, పోలెపల్లి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలు..

మడికొండ: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మడికొండ గ్రామానికి చెందిన వాల్మీకి బోయ కులస్తులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అలాగే, ఎంపీ కడియం కావ్యకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం జిల్లా నాయకులు బోగి కృష్ణమూర్తి, నిగ్గుల ప్రసాద్, వాల్మీకి సంఘం అధ్యక్షుడు బోగి లింగమూర్తి, కుర్ల మోహన్, రవీందర్, వెంకటయ్య, లింగయ్య, పెనుకుల రవీందర్, పేర్ల సురేష్, మూల అయిలయ్య, దండిగం సదానందం పాల్గొన్నారు.